ఆర్ఎస్‌పీని భారీ మెజార్టీతో గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం

అచ్చంపేటరూరల్, మే 3 : బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం ఉప్పునుంతల మండల కేంద్రంలో పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి నవీన్‌కుమార్ రెడ్డితోపాటు స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అసత్య వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక విఫలమైదన్నారు. అనంతరం ఉపాధి కూలీలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొత్త రవీందర్ రావు, విండో చైర్మన్ భూపాల్‌రావు, మాజీ సర్పంచ్ బాలునాయక్, నాయకులు గోపాల్‌రెడ్డి, చిన్నజంగయ్య, బాలస్వామి, రాంప్రసాద్, మల్లేశ్, పర్వతాలు, గోపాల్ ఉన్నారు.

ఆర్ఎస్‌పీని పార్లమెంట్‌కు పంపుదాం

తాడూరు, మే 3 : మండలంలోని చర్ల తిరుమలాపూర్, చర్ల ఇటిక్యాల గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్‌పీకి మద్దతుగా బీఆర్ఎస్ యువ నాయకుడు నాగం శశిధర్‌రెడ్డి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటేసి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. హక్కుల కోసం పోరాడే విద్యావంతుడైన ఆర్ఎస్‌పీని పార్లమెంట్‌కు పంపుదామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుశీలమ్మ, బీఆర్ఎస్ నాయకులు పాండు, రవి, బాలగౌడ్, లక్ష్మయ్య, జగన్నాథం, ప్రజలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

నాగర్‌కర్నూల్ టౌన్, మే 3 : బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం నాగర్‌కర్నూల్‌లోని 17వ వార్డులో పుర చైర్‌పర్సన్ కల్పనాభాస్కర్‌గౌడ్ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రతిభావంతుడైన ఆర్ఎస్‌పీని గెలిపిస్తే చదువుకునే పిల్లలకు ఎంతో ఉపయోగంమన్నారు.

చారకొండలో..

చారకొండ, మే 3 : బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా శుక్రవారం మండలంలోని సిరుసనగండ్ల, అయోధ్యనగర్, అగ్రహారంతండాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచ్ యాతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని చెప్పారు. ప్రజలు ఆలోచనతో కారు గుర్తుకు ఓటు వేసి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పశుల శ్రీను, రాంలాల్, జూమ్లానాయక్, మల్లేశ్, వినోద్, శ్రీకాంత్, మధు, మహేందర్ పాల్గొన్నారు.

అచ్చంపేటరూరల్ : ప్రచారం చేస్తున్న గువ్వల బాలరాజు

తాడూరు : ఇంటింటి ప్రచారంలో నాగం శశిధర్‌రెడ్డి

మరోసారి మోసం చేస్తున్న సర్కారు

- తెలకపల్లి ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, మే 3: ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒకటి అమలు చేసి మిగతా వాటికి పంగనామాలు పెట్టిందని, హామీల బాండు పేపర్లు బౌన్స్ అయ్యాయని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం తెలకపల్లి మండలంలోని గౌరెడ్డిపల్లి, కమ్మారెడ్డిపల్లి, వట్టిపల్లి, ఆలేరు, పెద్దపల్లి గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీలను నెరవేర్చకుండా దేవుళ్లపై ఒట్టుపెట్టి మరోసారి ప్రజల్ని మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మహాలక్ష్మి గ్యారెంటీ మహా మోసమన్నారు. అందుకే ఎంపీ ఎన్నికల్లో ఆర్ఎస్‌పీని గెలిపిస్తే సర్కారు మెడలు వంచి హామీలు అమలు చేయిస్తారన్నారు. తెలంగాణకు కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని.. కాంగ్రెస్ వచ్చాక అంతా రివర్స్ అయ్యిందన్నారు. పంటను కొనుగోలు చేయకుండా రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఈ సమస్యలపై గళం విప్పాలంటే కారుగుర్తుకు ఓటేసి ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్ రూరల్, మే 3 : దొంగ హామీలతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని, మోసం చేసిన సర్కారుకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రామాపురం, చింతలపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి ముఖ్య కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. విద్యావంతుడైన బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపునకు కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. పింఛన్, రైతుబీమా, రైతుబంధు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలల్లో తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్పోర్ట్స్ అథార్టీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

'రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలి'

రామాజీపల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

బల్మూరు, మే 3 : ప్రజలకు మభ్యపెట్టి మత రాజకీయాలకు చిచ్చు పెడుతున్న బీజేపీకి ఈనెల 13న జరిగే ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రాహుల్ గాంధీని ప్రధానిని చేసి తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని పోలిశెట్టిపల్లి, రాంనగర్‌కాలనీ, తోడెళ్లగడ్డ, రామాజీపల్లి, వీరంరాజుపల్లి, బాణాల, చెన్నారం, మహదేవుపూర్, మంగళకుంటపల్లి, ఇప్పకుంట, గట్టుతుమ్మెన్ గ్రామాల్లో కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, గిరివర్ధన్‌గౌడ్, జేపీరెడ్డి, నర్సింగ్‌రావు, యుగేంధర్‌రెడ్డి, తిరుపతయ్య, మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, సునీల్‌రెడ్డి, రాంప్రసాద్‌గౌడ్, విష్ణు, రమేశ్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

మోదీ పాలన దేశానికి ఎంతో అవసరం

- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

వెల్దండ : సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

వెల్దండ/పెద్దకొత్తపల్లి/బల్మూరు, మే 3 : ప్రధాని నరేంద్ర మోదీ సేవలు దేశానికి ఎంతో అవసరమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ బూత్ కమిటీ సభ్యులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేస్తామని కాంగ్రెస్ నాయకులు నరేంద్ర మోదీపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అదేవిధంగా పెద్దకొత్తపల్లిలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇందకంటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే బీజేపీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు బల్మూరు మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శేఖర్‌రెడ్డి, బాలస్వామి, మోహన్ రెడ్డి, శ్రీనివాసచారి, యాదగిరి, ఎంపీటీసీ చక్రవర్తి గౌడ్, విష్ణుగౌడ్, ఈశ్వర్ గౌడ్, బాలకృష్ణ, రమేశ్, పెద్దయ్య, శ్రీను, తిరుపతయ్య, వెంకటేశ్, రాజు, శివాజీ, ఉన్నారు.

పార్టీలకతీతంగా ముందుకు రావాలి

సమావేశంలో మాట్లాడుతున్న గోళి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, మే 3 : బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపునకు పార్టీలకతీతంగా ముందుకురావాలని తెలంగాణ రాష్ట్ర పుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెరుకూరులో శుక్రవారం గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్‌పీ గెలుపు కోసం పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భీమయ్య గౌడ్, మాజీ ఉపసర్పంచ్ నర్సింహముదిరాజ్, గ్రామస్తులు మైసయ్య, ఎండీ అలీల్, లాలయ్య, యాదయ్య, మల్లయ్య, జంగయ్య, రామచంద్రయ్యగౌడ్, వెంకటయ్య, కొండల్, రాజు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయాలి

బిజినేపల్లి, మే 3: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. శుక్రవారం బిజినేపల్లిలో ఆయన విలేకరులతో సమావేశమై మాట్లాడారు. 11వ తేదీ వరకు టీపీజేఏసీ ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం కోసం ప్రచార జాత నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రజల కోసం ఏమీ చేయలేదని విమర్శించారు. పెట్టుబడిదారులకు ప్రైవేటీకరణను ప్రోత్సహించిందని ఎద్దేవా చేశారు. పాలమూరు జిల్లా అభివృద్ధికి బీజేపీ ఏనాడూ కృషి చేయలేదన్నారు. ప్రజలకు మంచి చేసే నాయకుడిని గెలిపించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రధానంగా కార్మిక చట్టాల అమలు, నిరుద్యోగ నిర్మూలన, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలన్నారు. సమావేశంలో ముత్తయ్య, రామగిరి, రవిచందర్, ప్రకాశ్, శ్రీదేవి, ఖలీల్, సత్య, యాదయ్య, సత్యనారాయణ, ఘట్టన్న, లక్ష్మీనారాయణ, శంకర్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

ఊర్కొండ, మే 3 : బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీరారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు మండల కేంద్రంలో ప్రచారం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు గిరినాయక్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్‌షోను విజయవంతం చేయాలి

వంగూరు, మే 3 : మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే రోడ్‌షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు గణేశ్‌రావు, నరేందర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కోనేటిపూర్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా నిర్వహించే రోడ్‌షోకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరయ్యే విధంగా నాయకులు కృషి చేయడంతోపాటు శ్రేణులు తరలిరావాలని సూచించారు. సమావేశంలో నాయకుడు సురేందర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

కల్వకుర్తిరూరల్, మే 3 : కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతుబంధు సమితి గ్రామ కన్వీనర్ సురేశ్‌గౌడ్, సురేందర్‌గౌడ్, రైతులు కోరారు. అధికారులు స్పందించి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

- 8వరకు హోం ఓటింగ్..
- ఓటు వినియోగించుకోనున్న 546మంది ఓటర్లు..
- 33 రూట్లలో 22 బృందాలు విధుల్లో..
- రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్

పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మే 3 : పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించాలని రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీ అభ్యర్థులు, ఏజెంట్లు, పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్, అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నిబంధనలు, సీ-విజిల్ యాప్, సువిధ యాప్ గురించి వివరించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 8వ తేదీ వరకు హోం ఓటింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. హోం ఓటర్లు 546 మంది ఉండగా.. అందులో సీనియర్ సిటిజన్లు 228 మంది, దివ్యాంగులు 259, అత్యవసర సేవలకు సంబంధించిన 59 మంది ఓటర్లు ఉన్నారన్నారు. హోం ఓటింగ్ ప్రక్రియకు 33 రూట్లను ప్రేమ్ చేశామని, 22 బృందాలు ఓటింగ్‌లో పాల్గొంటాయన్నారు. హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సూచించిన తేదీల్లో ఇంటి వద్ద అందుబాటులో ఉండాలన్నారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 546 మంది ఓట్ ఫ్రమ్ హోం సదుపాయాన్ని వినియోగించుకోనున్నారని వివరించారు. బృందంలో పీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్‌తోపాటు వీడియోగ్రాఫర్, పోలీస్ సిబ్బంది ఉంటారన్నారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి అభ్యర్థులతోపాటు రాజకీయ పార్టీలకు ముందస్తుగానే సమాచారం చేరవేశామని, ఈ ప్రక్రియను వారు కూడా పరిశీలించవచ్చని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు నామినేషన్లు వేసిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల వ్యయ ఖర్చుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా డబ్బు, మద్యం పంపిణీపై ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్‌టీ తనిఖీలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి లావాదేవీని తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సువిధ పోర్టల్‌లో నమోదుపై రాజకీయ పార్టీల వారీగా అవగాహన కలిపించామన్నారు. అకౌంటింగ్ టీమ్ సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

ఎరువుల కొరత రానివ్వొద్దు

- డీలర్లు నిబంధనలకు లోబడి పనిచేయాలి
- కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మే 3 : రైతులకు ఎరువుల కొరత రానివ్వకుండా డీలర్లు, దుకాణదారులు స్టాక్‌ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వర్షాకాలంలో రైతులకు ఎరువుల కొరత లేకుండా డీలర్లతో జిల్లాస్థాయి ఎరువుల పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వానకాలంలో ఎరువుల కొరత రాకుండా జిల్లాస్థాయి ఎరువుల పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యవసాయ ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ కొరత లేకుండా చూడాలన్నారు. 2024-25 సంవత్సరానికి లక్షా 30వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. నాణ్యమైన ఎరువులను పీఓఎస్ మిషన్ద్వారానే అమ్మాలని సూచించారు. కంపెనీలు 60 శాతం యూరియాను మార్క్‌ఫెడ్‌కు ఇవ్వాలని, 40శాతం ఎరువులు ప్రైవేట్ డీలర్లకు ఇవ్వాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖాధికారులు యూరియా కొరత రాకుండా పర్యవేక్షించాలన్నారు. హోల్‌సేల్, రిటైల్ డీలర్లు నాణ్యమైన ఎరువులను ఎంఆర్‌పీ ధరలకే అమ్మాలన్నారు. జిల్లాలోని 450 ఎరువుల దుకాణాలు నియమాలకు లోబడి పనిచేయాలని, లేని పక్షంలో లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. ఏవోలు వారికి నిర్దేశించిన 240 ఎరువుల నమూనాలను తీసి ఎరువుల నాణ్యత పరీక్ష కోసం హైదరాబాద్‌కు పంపాలన్నారు. ఏడీఏలు, ఏవోలు ఎరువులకు సంబంధించిన కార్యక్రమాలపై ఆలస్యం చేయకూడదని, అలా చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారులు, మార్క్‌ఫెడ్ అధికారి, ఎరువుల కంపెనీల మార్కెటింగ్ అధికారులు, హోల్‌సేల్ డీలర్లు పాల్గొన్నారు.

ఈజీఎస్ కూలీలకు వసతులు కల్పించాలి

కల్వకుర్తిరూరల్, మే 3 : గ్రామాల్లో ఈజీఎస్ పనులకు వచ్చే కూలీలకు వేసవి దృష్ట్యా తగిన వసతులు కల్పించాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ అదనపు కమిషనర్ రవీందర్ సూచించారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని ఈజీఎస్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ జీఎస్ పనులపై జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ఈజీఎస్ సిబ్బంది, ఎంపీడీవోలతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో ని అన్ని మండలాల ఈజీఎస్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈజీఎస్ పనులు నిర్వహించే ప్రదేశాలలో తాగునీరు, టెంట్, మెడికల్ కిట్, నీడనిచ్చే ప్రదేశాలను గుర్తించి అక్కడే వారికి వ సతులు కల్పించాలని సూచించారు. ఎండ ప్ర భావం ఎక్కువగా ఉన్నందున ఉదయం 6 గం టల వరకు పని ప్రదేశాలకు వచ్చే విధంగా అ క్కడే వారికి పనులకు సంబంధించి పనులను మార్కింగ్ ఇవ్వాలని పేర్కొన్నారు. కూలీలు చేసే పనులకు సంబంధించి మస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఈజీఎస్ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం కృష్ణమూర్తి, డీపీవో కృష్ణ, డీఆర్డీవో పీసీ ఓబులేష్, ఏపీడీ చంద్రశేఖర్, కల్వకుర్తి ఎంపీడీవో వెంకట్రాములు, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో స్వేరోస్ ముఖాముఖి

వెల్దండ, మే 3 : పేద బడుగు బలహీన వర్గాల కోసం నిత్యం ఆరాటపడే రిటైర్డ్ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గెలిపిస్తే పేదలకు న్యాయం జరుగుతుందని స్వేరోస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వెల్దండ మండలం కొట్ర గ్రామంలో ఉపాధి కూలీలతో స్వేరోస్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు నిరంజన్, జంగిలి యాదగిరి, చంద్రశేఖర్, నాయకులు, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెద్దకొత్తపల్లి, మే 3: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో శనివారం మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్ శుక్రవారం పేర్కొన్నారు. నేషనల్ హైవే పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెన్నంపల్లిలో దారుణ హత్య

- ప్రాణం మీదికి తెచ్చిన మామిడి కాయల గొడవ
- క్షణికావేశంలో గొడ్డలితో నరికి చంపిన వ్యక్తి

లింగాల, మే 3 : మామిడికాయల గొడవ కాస్త దారుణ హత్యకు దారితీసిన ఘటన లింగాల మండలం చెన్నంపల్లి లో శుక్రవారం చోటు చేసుకున్నది. లింగాల ఎస్సై జగన్ మోహన్ కథనం మేరకు మండలంలోని చెన్నంపల్లిలోని అతికారి మల్లాజీ(42) తన అన్నయ్య శ్రీనివాసులుతో కలిసి మామిడి తోటను కొల్లాపూర్‌కు చెందిన వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. కాగా మామిడి తోటను భద్రం చేయడానికి అక్కడే లక్ష్మీశంకర్ ఉండి సమీపంలో మేకలను మేపుతున్నాడు. అదే మామిడితోటలో మల్లాజీ కలుపు పనులు తీయడానికి కూలీలను తోటకు తీసుకెళ్లాడు. అక్కడే మేకలను మేపుతున్న లక్ష్మీశంకర్, మల్లాజీ మామిడి కాయల విషయంలో మాటామాట అనుకొని ఇద్దరూ గొడవ పడి కొట్టుకున్నారు. దీంతో ఆవేశంతో లక్ష్మీ శంకర్ తన చేతిలో ఉన్న గొడ్డలితో బలంగా కొట్టడంతో మల్లాజీ అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అచ్చంపేట సీఐ రవీందర్ ఘటనా స్థలానికి చేరుకొని పంచానామా నిర్వహించి పోస్టుమార్టం నిమ్తితం మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ దవాఖాన కు తరలించారు. కుటుంబ సభ్యుడు శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. భార్య మమతబాయి మల్లాజీతో గొడవ పడి 6నెలల కిందట పుట్టింటికి వెళ్లిపోగా మల్లాజీ అన్న వద్దే పనులు చేస్తున్నాడు.

మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్పీ

నాగర్‌కర్నూల్, మే 3 : నిషేధిత మాదకద్రవ్యాలను నిర్మూలిద్దామని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో డీసీఆర్బీ డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిషేధం పై పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలైన గంజాయి, కల్తీ కల్లును నిర్మూలించి సమాజాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు అలవాట్లకు గురికాకుండా, ముఖ్యంగా మత్తుకు బానిసలు కా కుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా 14 -16 ఏండ్ల వయసు పిల్లలు గంజాయికి అలవాటు పడుతున్నారని.. అటువంటి కేసులు తమకు చాలా కేసులు వస్తున్నాయన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై జిల్లాలో విక్రయాలు జరిగినా అనుమానం వచ్చినా.. రవాణా చేస్తున్నారని తెలిసినా సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ సత్యనారాయణ, నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, సీఐ ఉపేందర్, ఎస్సై గోవర్ధన్ పాల్గొన్నారు.

బల్మూరులో..

బల్మూరు, మే 3 : మండలంలోని పోలిశెట్టిపల్లి, బల్మూరు, కొండనాగుల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఏస్పీ వైభవ్ గ్వైకాడ్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన బల్మూరు పోలీసు స్టేషన్ తనిఖీ చేసి పలు రికార